సాక్షి
జగిత్యాల
మంగళవారం । 28 । నవంబర్ । 2023



ముగిసిన గంగాహారతి

ధర్మపురి: ధర్మపురిలో నిర్వహిస్తున్న గంగాహారతి సోమవారంతో ముగిసింది. గోదావరి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గోదావరి నదిలో దీపాలు వదిలారు.



చెన్నకేశవుడికి పూజలు

రాయికల్: చెన్నకేశవ ఆలయంలో కరీంనగర్ జిల్లా జడ్జి ప్రతిమ కుటుంబ సమేతంగా పూజలు చేశారు. ఆమెకు ఆలయ అర్చకులు సతీశ్ శర్మ ప్రసాదాలు అందించారు.


గరిష్టం/కనిష్టం
29.0/18.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశముంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ధర్మపురిలో పంచ సహస్ర దీపాలంకరణ



బ్రహ్మపుష్కరిణిలో పంచ సహస్ర దీపాలంకరణ

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలో సోమవారం నిర్వహించిన పంచ సహస్ర దీపాలంకరణ నేత్రపర్వంగా సాగింది. కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లోని నలువైపులా పంచ సహస్ర (ఐదువేల) దీపాలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి దీపాలంకరణను చూసి తరించారు. ముందుగా శ్రీలక్ష్మీనృసింహస్వాములను మేళతాళాల మధ్య తీసుకెళ్లి కోనేరు మధ్యలో ఉన్న భోగ మండపంలో ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు జరిపారు.


పోలింగ్ పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. ముందుగా రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లపై మాట్లాడారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులకు పోలింగ్‌లో భాగస్వామ్యం చేసేలా చూడాలన్నారు. మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గ అసెంబ్లీ కేంద్రంలో రిటర్నింగ్ అధికారులు లైసెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులకు సమాచారం అందించాలని సూచించారు. పోలింగ్ నిర్వహణకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్‌కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్ వరకు ఈవీఎం యంత్రాల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మాక్‌పోలింగ్ నిర్వహించాలని, ఇబ్బందులు లేకుండా చూస్తూ పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని, ఎపిక్ కార్డుల పంపిణీ బూత్‌స్థాయి అధికారులతో పంపిణీ చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లత, దివాకర పాల్గొన్నారు.

మద్యం రవాణా అరికడతాం



శ్రీధర్

జగిత్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమంగా రవాణా కాకుండా చూస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈనెల 26 వరకు 355 గుడుంబా నేరాలను గుర్తించి 33మందిని అరెస్ట్ చేశామని, 4,857 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని, 2,19,341లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామని వెల్లడించారు. నిందితులు ఉపయోగించిన 27 వాహనాలను సీజ్ చేశామన్నారు. 59 మంది బెల్ట్‌షాపుల నిర్వాహకులను అరెస్ట్ చేసి వారి నుంచి 404.23 లీటర్ల లిక్కర్, 499.60 లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అనధికారికంగా కల్లు విక్రయించిన 53 మందిపై కేసు నమోదు చేసి 9,840 లీటర్ల కల్లును ధ్వంసం చేశామన్నారు. 103 మందిని ఆయా తహసీల్దార్ల ముందు బైండోవర్ చేశామన్నారు.

కమలదళంలో జోష్!

- కరీంనగర్‌ను సిల్వర్‌సిటీగా మారుస్తా
- కేంద్ర పథకాలు, నిధులను కేసీఆర్ అడ్డుకున్నారన్న ప్రధాని
- కబ్జాదారులా... మీకోసం కొట్లాడే సంజయ్ కావాలా?
- కరీంనగర్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



సభకు హాజరైన ప్రజలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్‌టౌన్: కరీంనగర్ కాషాయ దళంలో జోష్ నెలకొంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఎస్సారార్ కళాశాల మైదానంలో బీజేపీ నిర్వహించిన సకల జనుల విజయసంకల్ప సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకావడం పార్టీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహాన్ని నింపింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు కార్యకర్తలు, ప్రజలు సుమారు 30 వేల మంది పాల్గొన్నారు. మోదీ మట్లాడుతున్నంతసేపు జయధ్వానాలు పలికారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. బీజేపీ కేంద్ర ప్రభుత్వం మొత్తం తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం మోదీ సర్కార్ నిధులు ఇచ్చినా.. కేసీఆర్ సర్కార్ అడ్డుకుందని, కేసీఆర్ కరీంనగర్‌ను లండన్ చేస్తానని తప్పుడు వాగ్దానం చేశారని పేర్కొన్నారు. బీజేపీతోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 'కేసీఆర్ సాగునీటి పేరుతో పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారు. కాళేశ్వరం అవినీతి గురించి తెలంగాణనే కాదు.. యావత్ దేశానికి తెలుసు. అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్‌కు తగిన శిక్ష పడాలా.. వద్దా..?' అని ప్రశ్నించారు. 'కేసీఆర్ సర్కార్ చిన్న, సన్నకారు రైతుల ఉసురుపోసుకుంది.. మోదీ సర్కార్ పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి సాయం చేసింది. ఉప్పుడు బియ్యం కొనుగోలు చేసింది. ఫిలిగ్రీ కళకు కరీంనగర్ ప్రసిద్ధి చెందింది. మన్ కీ బాత్‌లో కూడా ప్రస్తావించాను. స్వర్ణకారులు, కళాకారుల కోసం పీఎం విశ్వకర్మ యోజన ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఇక్కడి ఫిలిగ్రీ కళాకారులకు ఆధునిక ట్రైనింగ్, లక్షల రూపాయల రుణం లభిస్తుంది. కరీంనగర్‌ను సిల్వర్ సిటీగా తీర్చిదిద్దేందుకు బీజేపీ కృషి చేస్తుంది..' అన్నారు. తను వోకల్ ఫర్ లోకల్ అనేది.. కరీంనగర్ బాగు కోసమేనని స్పష్టం చేశారు.

ఎవరు కావాలో తేల్చుకోండి: బండి సంజయ్

'పేదల కోసం కష్టపడి పనిచేసిన నాలాంటోళ్లను గెలిపించకపోతే.. పేదల కోసం ఎందుకు కొట్లాడాలని నా కార్యకర్తలు ప్రశ్నిస్తే నేనేం సమాధానం చెప్పాలే..? నా భార్యాపిల్లలను చంపుతామన్న భయపడకుండా ధర్మం కోసం, ప్రజల కోసం ఇన్నాళ్లు పోరాడిన. నాకు ఓట్లేసి గెలిపించకుంటే నా భార్యాపిల్లలు ప్రశ్నిస్తే ఏమని చెప్పాలి. కరీంనగర్ ప్రజలారా ఒక్కసారి ఆలోచించండి. రాష్ట్రంలోని అన్ని వర్గాలు మీ తీర్పు కోసం ఎదురు చూస్తున్నయ్. ఒక్క చాన్స్ ఇస్తే ఐదేళ్లు మీకు సేవ చేసుకుంటా. కరీంనగర్‌కు రక్షణ కవచంగా నిలుస్తా'.. అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ కోరారు. 'నమ్మిన సిద్ధాంతం కోసం, కమల వికాసం కోసం ఇదే కరీంనగర్‌లో బీజేపీ కార్యక్రమాల పోస్టర్లను గోడలకు అంటించిన. జాతీయ, రాష్ట్ర నాయకులొస్తే స్వాగతం పలకడానికి, కార్యక్రమాలు నిర్వహించేందుకు కరీంనగర్‌లో పార్టీ జెండాలు కట్టిన సామాన్య కార్యకర్తను. మీరు పెంచి పోషించిన కార్యకర్త. ఆ రోజు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా గెలిపిస్తే, ఈనాడు మీ అందరి ఓట్లతో ఎంపీగా గెలిచిన వ్యక్తిని. నేను ఏనాడూ మా నాన్న పేరు చెప్పి రాజకీయాల్లోకి రాలేదు. నమ్మిన సిద్ధాంతం కోసం, సమాజాన్ని సంఘటితం చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి మీ ముందు నిలబడ్డా. చాలా మంది అంటుంటారు.. బండి సంజయ్ ఏం చేశారని. వాళ్లకు చెప్పండి.. 9 వేల కోట్ల నిధులు తీసుకొచ్చా. మీ అందరూ వ్యాక్సిన్ తీసుకున్నారు కదా.. ఎవరిచ్చారు? బియ్యం ఎవరిచ్చారు..? కరీంనగర్ అభివృద్ధికి రూ.9 వేల కోట్లు ఇచ్చిందెవరు? స్మార్ట్‌సిటీ నిధులు, గ్రామీణ సడక్ యోజన నిధులు, జాతీయ రహదారులిచ్చిందెవరు? ఈ దేశ అభివృద్ధికి నిధులిచ్చిందెవరు.. అలాంటి మహనీయుడికి నిలబడి చప్పట్లతో స్వాగతం పలకండి' అని సంజయ్ కోరడంతో అందరూ లేచి నిలబడి స్వాగతం పలికారు. తాను ఏనాడూ సంపాదన, కుటుంబం గురించి ఆలోచించలేదన్నారు. 'డబ్బు ఆశ ఉంటే నేను మీకోసం కొట్లాడి జైలుకు పోకపోయేవాడిని కాదు. నామీద ఆరోపణలు చేసిన నేతల్లారా.. నేను అవినీతికి పాల్పడ్డట్లు రుజువు చేస్తే తన ఆస్తి మొత్తం కరీంనగర్ అసెంబ్లీ ప్రజలకు రాసిస్తా.. ప్రమాణం చేసి చెబుతున్నా.. దమ్ముంటే డాక్యుమెంట్లు తీసుకురండి. డబ్బు సంపాదన ఉంటే బండి సంజయ్ రెండుసార్లు జైలుకు వెళ్లడు.. ఏ రోజు నా కు కష్టమొచ్చినా, ఇబ్బంది వచ్చినా నా వెనుక మోదీ ఆశీర్వాదం ఉంది. నా భుజం తట్టి ప్రోత్సహించారు. మీకోసం కొట్లాడితే 74 కేసులు పెట్టారు. మీకోసం ప్రాణత్యాగానికి వెనుకాడను. దయచేసి కరీంనగర్‌లో పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులను బేరీజు వేయండి. ఎవరు భూకబ్జాలకు పాల్పడుతున్నారు. ఎవరి కష్టార్జితంతో కరీంనగర్‌లో ఇట్లాంటి వాతావరణం చేశారో ఆలోచించండి..'



ప్రధాని మోదీకి జ్ఞాపిక అందిస్తున్న ఎంపీ సంజయ్

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన కేసీఆర్: బండి

'రాష్ట్రాన్ని కేసీఆర్ నాశనం చేసిండు. డబుల్ బెడ్రూం, ఉద్యోగాల పేరుతో అందరినీ మోసం చేశారు. 6 లక్షల కోట్ల అప్పుల పాల్జేశారు. ఏ విధంగా మళ్లీ వాటిని పూడుస్తారు. కాంగ్రెస్ ఎట్లా అభివృద్ధి చేస్తుంది? ఎట్లా జీతాలు ఇస్తుంది? అందుకే బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అప్పులు తీరి సుస్థిర పాలనతో అభివృద్ధి చేయడం సాధ్యం. ఎమ్మార్పీఎస్ చిరకాల వాంఛ ఎస్సీ వర్గీకరణ. పేదల కష్టాలు తెలిసిన వ్యక్తిగా మోదీ వారి కల నెరవేర్చారు. కరీంనగర్‌లో పోటీ చేసే ఇద్దరు అభ్యర్థులు (కాంగ్రెస్, బీఆర్‌ఎస్) టోపీ పెట్టుకుని నమాజ్ చేసుకుంటారు. ఎన్నికల తరువాత మసీదు జాగాలను కబ్జా చేస్తారు. ఎన్నికల ముందు గుడికిపోయి దండం పెడతారు. ఎన్నికలయ్యాక గుడి స్థలాలను మింగేస్తరు. పేదల ఇండ్లను కూల్చివేస్తారు. కరీంనగర్ ప్రజలంతా ఏకం కండి.. రెండుసార్లు ఓడిపోయా.. ఒక్కసారి గెలిపించండి. 5 రోజులు కష్టపడితే.. 5 ఏండ్లు మీకు సేవ చేసుకుంటా. కరీంనగర్‌కు రక్షణ కవచంగా నిలుస్తా.. మోదీ దేవుడెట్లా అవుతాడంటున్నడు కేటీఆర్.. మరి నీ అయ్య దేవుడా? ఆర్టీసీ కార్మికులు చనిపోతే బయటకు రాని మూర్ఖుడు మీ అయ్య. విద్యార్థులు, నిరుద్యోగులు చనిపోతే బయటకు రాలే.. రైతులు వడ్లకుప్పలపై పడి చనిపోతే బయటకు రాలే.. ఉద్యోగులు గుండెపగిలి చనిపోతే మీ అయ్య బయటకు రాలే.. మహిళలపై అత్యాచారాలు జరిగితే బయటకు రాలే.. పేదల బాధలు తెలిసి ఎప్పటికప్పుడు స్పందిస్తున్న ప్రధాని మోదీ నిజంగా దేవుడే. ఆయన మనలను ఆశీర్వదించడానికి మన గడ్డ పైకి వచ్చారు' అని బండి అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థులు బొడిగె శోభ, ఆరెపల్లి మోహన్, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, చెన్నమనేని వికాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే సన్న బియ్యం



ఒడ్డెరకాలనీలో మహిళలతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఓట్లు అభ్యర్థిస్తున్న సంజయ్‌కుమార్



ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే సంజయ్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: పేదల ఆకలి తీర్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సన్నబియ్యం పంపిణీ చేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాలరూరల్ మండలం అంతర్గాం, ఒడ్డెరకాలనీ, అర్బన్ మండలం అనంతారంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ నిరుపేదల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, సాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. గతంలో చాలా గ్రామాల్లో నీటి సమస్య ఉండేదని, ఆ సమస్యను బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే పరిష్కరించామని తెలిపారు. చల్‌గల్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు కోల నవీన్, వంశీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్‌రావు, నాయకులు బాల ముకుందం, గంగాధర్, రాజమణి, శ్రీనివాస్, మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఆదిరెడ్డి, స్వామిరెడ్డి, మల్లేశం పాల్గొన్నారు. పొలాసకు చెందిన వీర్ల పద్మ ఎమ్మెల్యే ఎన్నికల ఖర్చు కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పథకాలు

రాయికల్: బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందుతాయని ఎమ్మెల్యే అన్నారు. రాయికల్ మండలంలోని ఇటిక్యాల, చెర్లకొండాపూర్, రామారావుపల్లి, మూటపల్లి, కొత్తపేట, ఒడ్డెరకాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మాయమాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని, మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. జరగబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే అందరికీ సేవ చేస్తానని హామీ ఇచ్చారు. ఇటిక్యాలలో 20 మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, పార్టీ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మడం లేదనే బాండ్ పేపర్ నాటకం

జగిత్యాల: ఎన్ని హామీలు ఇచ్చినా నమ్మడం లేదని కాంగ్రెస్ బాండ్‌పేపర్ల కొత్త నాటకానికి తెరలేపిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మోతె రోడ్‌లోని పార్టీ ఆఫీసులో విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో జీవన్‌రెడ్డి జగిత్యాలకు చేసిందేమీ లేక ప్రతిపనికీ అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు. రాజీవ్ రహదారి తనే వేయించానని చెబుతున్న జీవన్‌రెడ్డి ఆ రహదారి జగిత్యాలకు కాకుండా రామగుండం ఎందుకు పోయిందో చెప్పాలన్నారు. యావర్‌రోడ్ వెడల్పు, గొల్లపల్లి రోడ్ వెడల్పు, అంతర్గత రోడ్లు, డ్రైయినేజీ, మున్సిపల్ డ్రాపాట్ మాస్టర్ ప్లాన్‌పై శివారు గ్రామాల ప్రజల్లో విషం నింపి రెచ్చగొట్టారన్నారు.

లారీ అసోసియేషన్ అభివృద్ధికి కృషి

లారీ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం లారీ అసోసియేషన్ నాయకులతో ఎమ్మెల్సీ రమణ, మాజీమంత్రి రాజేశంగౌడ్‌తో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు 10 ఎకరాల భూమి కేటాయిస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ దేశాయి, ఏఎంసీ చైర్మన్ దామోదర్‌రావు, గంగరాజం, మహేశ్వర్‌రావు, సురేందర్, శ్రీనివాస్, ఆంజనేయులు, రాజేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి చూడండి.. ఆదరించండి

అభివృద్ధి చూసి ఆదరించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని టీఆర్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో జగిత్యాలను జిల్లాకేంద్రం చేయడంతోపాటు, మెడికల్ కళాశాల వంటి ఎన్నో పనులు చేశామని పేర్కొన్నారు.

'సీ విజిల్' ద్వారా 474 సమస్యల పరిష్కారం

జగిత్యాల: సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 521 ఫిర్యాదులు రాగా.. 474 సమస్యలు పరిష్కరించామని, 47 డ్రాప్ చేశామని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని ఎలక్షన్ సెల్‌ను సోమవారం పరిశీలించారు. ఎన్నికల ఉల్లంఘన, ఓటర్లను మభ్యపెట్టడం, మద్యం తదితర పంపిణీ ఏదైనా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ సూచించారు. సీ విజిల్ యాప్‌తోపాటు, 1800 425 7620 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇప్పటివరకు టోల్‌ఫ్రీ ద్వారా 25 ఫిర్యాదులు రాగా అన్నీ పరిష్కరించామన్నారు. అలాగే 1950 హెల్ప్‌లైన్ ద్వారా 1784 ఫిర్యాదులు రాగా అన్నీ పరిష్కరించామన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా ఇప్పటివరకు 182 కేసులు నమోదు చేసి రూ.1,95,49,010 సీజ్ చేసి.. 180 కేసులు పరిష్కరించి రూ.1,93,63,940 తిరిగి ఇచ్చామని తెలిపారు. ఆమె వెంట వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో సాయుధ బలగాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న కేంద్ర సాయుధ బలగాలు

జగిత్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల్లో సాయుధ పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాకు కేంద్ర సాయుధ బలగాలు చేరుకున్నాయన్నారు. జిల్లాకు వచ్చిన పది బీఎస్‌ఎఫ్ కంపెనీల కేంద్రబలగాలతో ఆయన ఎస్పీ కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. జిల్లా పోలీసులతో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తర్వాత అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తారని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, రూట్ బందోబస్తు, స్ట్రాంగ్‌రూమ్, కీలకమైన పాయింట్ల వద్ద సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారని వివరించారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించి కవాతు నిర్వహిస్తూ.. ప్రజలకు భద్రతభావాన్ని కలిగించాలన్నారు. జిల్లాలోని పోలింగ్ స్టేషన్లు, చెక్‌పోస్టుల వివరాలు, భౌగోళిక పరిస్థితులను బీఎస్‌ఎఫ్ అధికారులకు వివరించారు. అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, బీఎస్‌ఎఫ్ అడిషనల్ కమాండెంట్ లియాన్, బీఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐ జానిమియా, బీఎస్‌ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓటేయండి



నర్సారెడ్డికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

- కాంగ్రెస్ పట్టుబట్టి రైతుబంధు ఆపింది
- ఎన్నికల ప్రచారంలో కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు
- పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



మొగిలిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వసంత



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్

మల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి పార్టీ అభ్యర్థి సంజయ్‌ని గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని మొగిలిపేటలో మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటే ఎక్కువన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రైతుబంధు నిధులను నిలిపివేయించారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ కుట్రలను ప్రజలు గమనించాలని కోరారు. ఆశీర్వదిస్తే సంజయ్‌కుమార్ మరింత అభివృద్ధి చేసి చూపిస్తారన్నారు. రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మున్నూరుకాపు సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి

కోరుట్ల: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి షేర్ నర్సారెడ్డి సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నర్సారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పథకాలు, సంజయ్ సేవలను గుర్తించే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నానని పేర్కొన్నారు.

రైతుబంధు నిలిపివేతకు కాంగ్రెసే కారణం: బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్

మెట్‌పల్లి: రైతుబంధు నిలిపివేతకు కాంగ్రెస్ పార్టీ కారణమని కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి నిలిపివేయించిన ఆ పార్టీకి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. ఆయన వెంట వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు రాణవేని సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆరోపణలు

కోరుట్ల రూరల్: ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును రాజకీయంగా ఎదుర్కొనలేక గంగపుత్రులను కించపరిచినట్లు ప్రచారం చేస్తున్నారని సంఘం నాయకులు అన్నారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు మద్దతు కోరేందుకు ఎమ్మెల్యే ఆదివారం జోగిన్‌పెల్లిలోని గంగపుత్ర సంఘానికి వచ్చారని, ఒకరిద్దరు ఇతర పార్టీలకు మద్దతు ఇస్తున్నారని తెలుసుకుని తను సంఘం అభివృద్ధికి కృషి చేసినా ఇతర పార్టీల వైపు వెళ్లడం సరికాదన్నారని, దీనిని కాంగ్రెస్, బీజేపీ నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి చెప్పి బాధపడ్డారుగానీ.. వేరే ఉద్దేశం కనిపించలేదన్నారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సంఘం నాయకులు పల్లికొండ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ పల్లికొండ నరేష్, గంగపుత్ర సంఘం పైడిమడుగు అధ్యక్షుడు తోకల రాము, కోరుట్ల మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు జుంబర్తి రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఎవరినీ అవమానించలేదు

మెట్‌పల్లి: గంగపుత్రులు, ముదిరాజ్‌లను అవమానించేలా తను మాట్లాడినట్లు వస్తున్న వార్తలను ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఖండించారు. గంగపుత్రులు, ముదిరాజ్‌లను తను ఎల్లప్పుడూ కుటుంబసభ్యులుగానే భావించానన్నారు. తన గురించి 15ఏళ్లుగా అందరికీ తెలుసన్నారు.

గంగపుత్రులకు ఎమ్మెల్యే క్షమాణలు చెప్పాలి

కోరుట్ల: గంగపుత్రులకు ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు క్షమాపణలు చెప్పాలని గంగపుత్ర, ముదిరాజ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం వేణుగోపాల్, కౌన్సిలర్ మాడవేణి నరేష్, బీజేపీ నాయకులు సుఖేందర్, కొత్త సురేష్, కలాల సాయిచెంద్, ఉరుమడ్ల చరణ్, తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురి గోదావరిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కోటిలింగాల వద్ద భక్తుల పుణ్య స్నానాలు

పులకించిన పుణ్యగోదావరి

ధర్మపురి/వెల్గటూర్: కార్తీకపౌర్ణమి సందర్భంగా ధర్మపురితోపాటు కోటిలింగాల వద్ద గోదావరి భక్తులతో పులకించిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి గోదావరిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. స్నానాల అనంతరం భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా గోదావరిలో దీపాలు వదిలిపెట్టారు. భక్తులకు కోటిలింగాల ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేసింది.

క్లుప్తంగా

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో ఎస్ఎస్టీ టీం సభ్యులు

రాయికల్: ఒడ్డెలింగాపూర్ చెక్‌పోస్టు వద్ద సోమవారం అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని వ్యక్తి వద్ద నుంచి పట్టుకున్నట్లు ఎస్ఎస్టీ టీం ఇన్‌చార్జి శరత్‌తేజ సోమవారం తెలిపారు. 21 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు చెప్పారు. టీం సభ్యులు శేఖర్, మోహన్, మహేశ్, సాయి, సతీశ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణం తరలించొద్దు

జగిత్యాలక్రైం: సారంగాపూర్ మండల కేంద్రంలోని మద్యం దుకాణాన్ని తరలించేందుకు అనుమతివ్వొద్దని పెంబట్ల వైన్స్ నిర్వాహకుడు బి.ప్రశాంత్ సోమవారం రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. గతంలో టెండర్లలో సారంగాపూర్ మద్యం దుకాణం దక్కించుకున్న వారు లక్ష్మీదేవిపల్లికి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని, దీంతో పెంబట్ల దుకాణం అమ్మకాలు పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

ధర్మపురిలో మహా అన్నదానం



కార్యక్రమానికి హాజరైన భక్తులు

ధర్మపురి: ధర్మపురిలోని అక్కపెల్లి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ధర్మపురి పట్టణంలో అక్టోబర్‌లో నవదుర్గా సేవాసమితి వారి ఆధ్వర్యంలో దసరా నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. దుర్గా మాతకు భక్తులు ఒడి బియ్యం సమర్పించారు. ఈ బియ్యాన్ని సోమవారం మహా అన్నదానంలో కలిపి అమ్మవారి నైవేద్యంగా అందజేశారు. నవదుర్గా సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ కవిత రాక



జగిత్యాల: జిల్లా కేంద్రంలో నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత పర్యటించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి టవర్‌సర్కిల్, నాయుడు చౌరస్తా, అన్నపూర్ణ చౌరస్తా, పాత బస్టాండ్ మీదుగా తహసీల్ చౌరస్తా వరకు జరిగే ర్యాలీలో పాల్గొనన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ దుర్మరణం



మల్యాల(చొప్పదండి): బైక్‌ను గడ్డి కట్టలతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనగా.. వివాహిత అక్కడికక్కడే మృతిచెందింది. సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా మల్యాల మండలం మానాల గ్రామానికి చెందిన గొల్లపల్లి భాగ్యవ్వ(47) తన కుమారుడితో కలిసి బైక్‌పై పెగడపల్లి మండలం ఆరవెల్లి గ్రామానికి వెళ్లింది. సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేసి తిరిగి ఇంటికి వస్తుండగా.. తక్కళ్లపల్లి శివారులో లంబాడిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ వెనక నుంచి బైక్‌ను ఢీకొంది. భాగ్యవ్వ తలపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఆమె కుటుంబ సభ్యుడు గొల్లపల్లి ప్రశాంత్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ జగిత్యాల నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తీగల అశోక్ తెలిపారు.

మహిళలు ఆదరిస్తేనే..

- జిల్లాలో అత్యధిక ఓట్లు వారివే..
- ఆకట్టుకోవడానికి అభ్యర్థుల ప్రయత్నాలు
- నేటి సాయంత్రం 5 గంటలతో ప్రచారానికి తెర
- మహిళా సంఘాలకు గాలం

మహిళల ఓట్లు

కోరుట్ల	1,25,692
జగిత్యాల	1,19,728
ధర్మపురి	1,15,702



జగిత్యాల: జిల్లాలో అత్యధిక ఓట్లు మహిళలవే ఉన్నాయి. పురుషుల కన్నా మూడు నియోజకవర్గాల్లో 23,300 మంది ఎక్కువగా ఉన్నారు. వీరి తీర్పే ప్రధానం కానుంది. ఇప్పటికే మహిళలను ఆకట్టుకోవడానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ప్రచారం ముగియనుండగా.. వీరి ఓట్లు ఎలా రాబట్టుకోవాలో ప్రయత్నాలు ప్రారంభించారు.

ప్రచారానికీ వారే..

అటు ప్రచారాలు, ఇటు సభలకు మహిళలకే ప్రాధాన్యమిస్తూ పిలిపించుకున్నారు. పురుషుల కన్నా ఎక్కువగా వారే తరలివచ్చారు. నెల రోజులుగా ప్రతి సభకు పిలుస్తూ ఒకరోజుకు రూ.200 నుంచి రూ.300 ఇవ్వడంతో పాటు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు ప్రచారానికి రావడంతో పాటు వారి ఓట్లు సైతం వేస్తారనే ఉద్దేశంతో ప్రధాన అభ్యర్థులు వారికే ప్రాధాన్యమిస్తున్నారు. అత్యధికంగా మహిళలున్న కుటుంబాలను ఎంపిక చేసుకొని వారిని ఆకట్టుకోవడానికి ద్వితీయ స్థాయి నేతలతో వ్యూహం రచిస్తున్నారు. ఇప్పటికే పలు రోడ్‌షోలు, సభలకు అగ్ర నేతలు రాగా.. మహిళలనే అధిక సంఖ్యలో తరలించడంతో పాటు వారికి అనేక హామీలు సైతం ఇచ్చారు. సమయం దగ్గర పడటంతో.. క్షేత్రస్థాయిలో మహిళా ఓట్లను అభ్యర్థించేందుకు వివిధ ప్రయత్నాలు చేస్తున్నారు.

కుటుంబ సభ్యులతో..

మహిళా ఓట్లు అత్యధికంగా ఉండటంతో.. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎక్కువగా వారి కుటుంబ సభ్యులతో ప్రచారం చేయిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల సతీమణులు, కూతుళ్లు, కోడళ్లతో ప్రచారం చేయిస్తూ మహిళల ఓట్లు రాబట్టుకునే పనిలో పడ్డారు. ఇంటింటా ప్రచారంలో చురుగ్గా పాల్గొంటూ మహిళా ఓటర్ల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. వారి సమస్యలను అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని పేర్కొంటూ హామీలు సైతం ఇస్తున్నారు.


మంతనాలు..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘాలతో సైతం మంతనాలు చేస్తున్నారు. మహిళా గ్రూపులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు సైతం వెనుకాడటం లేదు. ఇప్పటికే గ్రూపునకు ఇంత అందజేసేలా స్థానిక నాయకులు చూస్తున్నారు. వారు సైతం డిమాండ్ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘాలు, సమైక్య గ్రూపుల వారు సైతం సమావేశాలు నిర్వహించుకుంటూ ప్రధాన పార్టీల అభ్యర్థుల నుంచి హామీలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

అకాల వర్షం... తడిసిన ధాన్యం



రాయికల్‌లో తడిసిన ధాన్యం



ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో తడిసిన వరిధాన్యం



తడిసిన ధాన్యంతో రైతు

రాయికల్: పట్టణంతో పాటు రామాజీపేట, కుమ్మరిపల్లి, రాయికల్, అల్లీపూర్ గ్రామాల్లో సోమవారం కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. అసలే తేమ శాతం రాక ఇబ్బందులు పడుతుంటే అకాల వర్షంతో తడిసిన ధాన్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలో సోమవారం అకాల వర్షం పడింది. వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు అమ్మకానికి వరి ధాన్యం పోశారు. అయితే కొందరు రైతులు అందుబాటులో ఉండి ధాన్యం తడవకుండా కవర్లను కప్పుకోగా.. కొందరు రైతులు కప్పకపోవడంతో ధాన్యం తడిసింది.

ప్రలోభాలకు సిద్ధం..

- విందులతో ఓటర్లను ఆకట్టుకుంటున్న అభ్యర్థులు
- బహుమతులు, చీరలు, సామగ్రి పంపిణీ
- మద్యం, డబ్బులు కూడా..



మేడిపల్లిలో పట్టుకున్న మద్యం(ఫైల్)

జగిత్యాలరూరల్: ఈనెల 30న పోలింగ్ సందర్భంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు విందుతో పాటు బహుమతులు, నగదు, మద్యం పంపిణీకి తెర తీశారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో గురువారం పోలింగ్ జరగనుంది. ప్రత్యేక విందులతో పాటు ఇతర బహుమతులు, సామగ్రి, నగదు, మద్యం ఇస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. చికెన్, మటన్ ఇంటింటికీ పంపిణీ చేస్తూ ప్రలోభాలకు గురి చేస్తున్నారు. అభ్యర్థులు తమ కార్యకర్తలు, నాయకులతో వాల్ పోస్టర్లతో పాటు డోర్ స్టిక్కర్లు, ఫ్లెక్సీలు, నమూనా బ్యాలెట్ పేపర్లు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. కొంతమంది తమకు కేటాయించిన గుర్తులను చూపిస్తున్నారు. ఇప్పటికే మద్యం, డబ్బులు, బహుమతులు సిద్ధం చేసుకున్నారు. ఎన్నికల అబ్జర్వర్లు కూడా పంపిణీని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా టీంలను ఏర్పాటు చేశారు.

మల్లాపూర్‌లో కేంద్ర బలగాల కవాతు



కవాతు చేస్తున్న బీఎస్ఎఫ్ కేంద్ర సాయుధ బలగాలు

మల్లాపూర్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛ, శాంతియుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని మెట్‌పల్లి డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో బీఎస్ఎఫ్ కేంద్ర సాయుధ బలగాలతో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. మల్లాపూర్‌లోని కొత్త బస్టాండ్ వద్ద ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్.. అల్లూరి సీతారామరాజు కూడలి, హన్మాన్ దేవాలయం, అంబేడ్కర్ కూడలి, పాత బస్టాండ్ భరతమాత కూడలి, నంది చౌరస్తా మీదుగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ముగిసింది. పోలీస్ సబ్–డివిజన్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు నాలుగు కంపెనీల(400మంది) బీఎస్ఎఫ్ కేంద్ర సాయుధ బలగాలు చేరుకున్నాయన్నారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు ఎన్నికల్లో ఓటేసే ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకే కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించడం ద్వారా ప్రజలు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని అన్నారు. మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్, బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ బిష్ణోయ్, ఎస్సైలు రాంస్వరూప్ నివాస్, బాబాలాల్, 100మంది సిబ్బంది పాల్గొన్నారు.



ఎలుగుబంటి వేషధారణలో సెక్యూరిటీ గార్డు

కోతులు రాకుండా కొత్త ప్రయోగం..

కొండగట్టు: కోతుల బెడద నుంచి విద్యార్థులను రక్షించడానికి జేఎన్టీయూ అధికారులు కొత్త ప్రయోగం చేశారు. కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల కొండగట్టు గుట్టలను ఆనుకొని ఉండటంతో కోతుల బెడద అధికమయింది. కోతులు ఆహారం కోసం విద్యార్థులపై దాడులు చేయడంతో భయపడుతున్నారు. గతంలో కొందరు గాయపడ్డ సందర్భాలున్నాయి. ఎన్ని రకాల ప్రయోగాలు చేసినా కోతుల బెడద తగ్గకపోవడంతో.. ప్రిన్సిపాల్ కామాక్షి ప్రసాద్, హాస్టల్ మేనేజర్ ప్రవీణ్ కొత్తగా ఆలోచించారు. వారం రోజుల క్రితం ఎలుగుబంటి ఆకారాన్ని పోలిన డ్రెస్ కొనుగోలు చేసి సెక్యూరిటీ విధులు నిర్వహించే స్టాఫ్‌తో కళాశాల చుట్టు తిరిగేలా చేశారు. దీంతో కోతుల బెడద కొంత తగ్గిందని వారంటున్నారు.

ఎన్నికలపై నిఘా..



బతికపల్లి పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు

- శాంతియుతంగా నిర్వహించడంపై దృష్టి
- క్రిటికల్ గ్రామాల గుర్తింపు

పెగడపల్లి: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే అంశంపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. నామినేషన్ తరుణం నుంచి పోలింగ్ వరకు జరిగే ప్రక్రియలో పరిస్థితులు అదుపు తప్పకుండా ఉండేందుకు నిశిత దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఉంచేందుకు సమాయత్తమవుతున్నారు. మండలంలో మొత్తం 23 గ్రామాలున్నాయి. ఇందులో లింగాపూర్, నంచర్ల, బతికపల్లి, ఆరవెల్లి, దోమలకుంట, అయితిపల్లి, నందగిరి, పెగడపల్లి, ఏడుమోటలపల్లి, నామాపూర్ గ్రామాలను క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. మిగతా గ్రామాలు సాధారణంగా ఉన్నట్లు పోలీస్ శాఖ గుర్తించింది. ఈ మేరకు ఆయా చోట్ల ప్రత్యేక పరిస్థితులున్నాయని, పోలింగ్ ముగిసేవరకు ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని పోలీస్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

గత పరిస్థితుల ఆధారంగా గుర్తింపు

సమస్యాత్మక గ్రామాలను గుర్తించే క్రమంలో పోలీస్ శాఖ గత పరిస్థితులు, ప్రస్తుత రాజకీయ వివాదాస్పద అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో గతంలో ఏదేని సార్వత్రిక లేదా స్థానిక ఎన్నికల సమయంలో అల్లర్లు జరగడం, పోలీసు కేసులు నమోదు కాబడిన సందర్భాలుంటున్నాయి. ఇలాంటి వాటిని పరిశీలించి రెండు, మూడేళ్లుగా ఉన్న రాజకీయ పరిస్థితులు, పార్టీలు, పార్టీల నుంచి వలసలు వస్తే వాటి ఆధారంగా అల్లర్లు చోటుచేసుకునే అవకాశముండటం వంటి వాటిని ముందస్తుగా గమనిస్తున్నారు. నిరంతరం పోలీసులు వెళ్లడంతో ఆయా చోట్ల గ్రామ పెద్దలు, పార్టీల ప్రతినిధుల ద్వారా వివరాలు సేకరించడం, సున్నితపరమైన అంశాలు తెలుసుకునేందుకు ప్రణాళికలు రూపొందించారు. గత, ప్రస్తుత పరిస్థితులను బట్టి ఎన్నికల్లో ఎటువంటి ఘర్షణ లేకుండా పోలీసు శాఖ ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది.

ఇతర గ్రామాల్లోనూ..

ప్రత్యేకంగా గుర్తించిన క్రిటికల్ గ్రామాలతో పాటు సాధారణ గ్రామాలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించనుంది. సాధారణ గ్రామాలతో పోల్చితే క్రిటికల్ ప్రాంతాల్లో రెట్టింపు నిఘా ఉంటుంది. కానీ సాధారణ గ్రామాల్లోనూ నిత్యం పర్యవేక్షణ చేయనున్నట్లు పోలీస్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజలు సహకరించాలి



ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలి. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ ఘర్షణలు జరుగుతుంటాయి. ఎన్నికల్లో యువత ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో గొడవలకు తావివ్వకుండా నిర్వహించేందుకు సహకరించాలి. ఈ పరిస్థితుల్లో మండలంలోని గ్రామాలను క్రిటికల్, సాధారణ గ్రామాలుగా గుర్తించాం. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు యువత, రాజకీయ పార్టీలు సహకరించాలి.

– సతీశ్, ఎస్సై, పెగడపల్లి

సమాజాన్ని కదిలించే కవిత్వం రావాలి

సిరిసిల్ల: సమాజాన్ని కదిలించే శక్తివంతమైన, ప్రజాజీవితాలను ప్రభావితం చేసే కవిత్వం రావాలని అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం కోరారు. సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత కోడం పవన్‌కుమార్ రచించిన ఏలక్షణం కవితా సంకలనాన్ని జిల్లా కేంద్రంలో సోమవారం జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.



దుబ్బ రాజన్న ఆలయంలో ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రాయికల్ మార్కండేయ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



మల్లాపూర్: దీపాలు వెలిగిస్తున్న భక్తులు



దుబ్బ రాజన్న ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక పౌర్ణమి వేడుకలు

సారంగాపూర్: దుబ్బ రాజన్న ఆలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో మహిళలు, యువతులు, చిన్నారులు కార్తీక దీపాలను వెలిగించారు. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రాయికల్: పట్టణంలోని మార్కండేయ, చెన్నకేశవనాథ, వాసవి కన్యకపరమేశ్వరి మాత, కొత్తపేట నాగాలయాల్లో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండ వద్ద శ్రీకనకసోమేశ్వర ఆలయంలో లక్ష దీపాలంకారణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం నేతృత్వంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు బల్యపెల్లి ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో శశికాంత్‌శర్మ, సోమేశ్వరశర్మ బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు.